ఒక్కసారి అవకాశం ఇవ్వండి

● మీ బంగారు భవితకు నేనే గ్యారెంటీ ● తిరునెల్వేలి సభలో ప్రధాని మోదీ పిలుపు





సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటి దాకా ఎన్నో పార్టీలకు ఓటేసి గెలిపించారు. ఈ ఒక్కసారి ఎన్డీయేకి అవకాశం ఇచ్చి చూడండి మీ బంగారు భవిష్యత్తుకు నేను గ్యారెంటీ' అని ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర ప్రజలను అభ్యర్థించారు. తిరునెల్వేలి జిల్లా అగస్త్యర్‌పట్టిలో సోమవారం సాయంత్రం ఏర్పాటైన ఎన్డీయే ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తన చివరి ప్రచార సభలో పాల్గొంటున్నానని చెప్పిన మోదీ... తమిళులంతా తనకు ఆదరాభిమానాలు, ఆశీస్సులు అందిస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ డీఎంకే, కాంగ్రెస్‌లు రాష్ట్రంలో ఎన్డీయేకు అవకాశం లేదంటూ అరిగిపోయిన పాత టేప్‌రికార్డర్‌లా చెబుతున్నాయని, ఆ పార్టీలంతా దిగ్భ్రాంతి చెందేలా తమిళ ప్రజలు ఎన్డీయేని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎనిమిది సార్లు జరిపిన తన పర్యటనలకు తమిళ మహిళలు గట్టి మద్దతు ఇస్తుండటం చూసి ప్రతిపక్షాలన్నీ విస్తుపోతున్నాయని, దీనికి గత పదేళ్లుగా మహిళాభ్యుదయానికి తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలే కారణమన్నారు. 1.25 లక్షల కుటుంబాలకు జలజీవన్ పథకం అమలు చేశామని, ఆవాస్ యోజన కింద 12 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని, 40లక్షల మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, 57 లక్షల మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చామని మోదీ ప్రకటించారు.



మోదీకి పుస్తకాన్ని బహూకరిస్తున్న బీజేపీ నాయకుడు

ఆ త్యాగధనులే స్ఫూర్తి...

తిరునెల్వేలి సీమలో అడుగుపెట్టగానే తనకు తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడిన మరుదు సోదరులు, వీరపాండ్యకట్టబ్రహ్మన, వేలునాచ్చియార్, ముత్తురామలింగ దేవర్ గుర్తుకు వస్తున్నారని, సుభాష్‌చంద్రబోస్ సైనిక దళంలో ఈ సీమకు చెందిన యువకులే అధిక సంఖ్యలో చేరారని మోదీ తెలిపారు. ఆ త్యాగధనుల ఆశయాలను నెరవేర్చటమే ఎన్డీయే ప్రధాన సంకల్పమన్నారు. వావు. చిదంబరం పిళ్లై ఆంగ్లేయుల కాలంలోనే ఆత్మనిర్భర్ పథకం అమలు చేశారని, స్వదేశీ నౌకా వాణిజ్యం సాగించి తెల్లదొరలతో పోటీ పడ్డారని చెప్పారు. వావుసిని స్ఫూర్తిగా తీసుకునే తమ ప్రభుత్వం ఆత్మనిర్భర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

ఆ పార్టీలు తమిళ సంస్కృతికి శత్రువులు...

ఇండియా కూటమిలోని కాంగ్రెస్, డీఎంకేలు తమిళ భాష, తమిళ సంస్కృతిని నాశనం చేస్తున్నాయని, ఆ రెండు పార్టీలు సెంగోల్ అయినా, జల్లికట్టు అయినా వాటిని తీవ్రంగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్నాయని మోదీ అన్నారు. తమ ప్రభుత్వం తమిళభాషకు అంతర్జాతీయ ఖ్యాతిని కలిగించేందుకే తిరువళ్లువర్ కల్చరల్ సెంటర్‌ను నెలకొల్పనున్నదని, ఈ విషయాన్ని మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు.

మాదకద్రవ్యాల రాష్ట్రం...

తమిళనాడు ప్రస్తుతం మాదక ద్రవ్యాలకు నిలయంగా మారిందని, డీఎంకే ప్రభుత్వం మాదక ద్రవ్య మాఫియాను ప్రోత్సహించి యువతను అంధకారంలో పడేసిందని మోదీ విమర్శించారు. మత్తులో జోగుతున్న తమ పిల్లలనుచూసి తల్లిదండ్రులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వీటన్నింటినీ చూస్తూ తాను మిన్నకుండిపోతానని ఎవరూ భావించకూడదని, ఈ ఎన్నికల్లో తమ కూటమిని గెలిపిస్తే రాష్ట్రం నుండి మాదక ద్రవ్యాలా మాఫియా ముఠాలను మట్టుపెడతానని ఉద్వేగంగా అన్నారు. ఇక రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన కామరాజర్, ఎంజీఆర్, జయలలిత వంటి నేతల కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చిన ఘనత డీఎంకేదన్నారు. జయలలితను శాసనసభలోనే అవమానించి మహిళల పట్ల తనకున్న గౌరవాన్ని డీఎంకే ఎలుగెత్తి చాటుకుందన్నారు. తన సభలకు వస్తున్న జనాన్ని చూసి డీఎంకే కాంగ్రెస్ పార్టీలకు కంటి మీద కునుకులేకుండా పోయిందన్నారు. కచ్చాదీవిని పొరుగు దేశానికి ధారాదత్తం చేసిన డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు ఘోరమైన చారిత్రక తప్పిదానికి పాల్పడినట్లు ఇటీవల ఆధార పత్రాలతో తాము వాస్తవాలను వెల్లడించామన్నారు.

దక్షిణాదిన బుల్లెట్ రైలు...

తమిళనాట వందేభారత్ రైళ్లను ప్రారంభించిన తాను మళ్లీ అధికారంలోకి వస్తే దక్షిణాదిన బుల్లెట్ రైలు నడిపేందుకు తక్షణ చర్యలు చేపడతానని మోదీ ప్రకటించారు. మోదీ తన ప్రసంగాన్ని తమిళంలో సోదరసోదరీమణులారా నమస్కారం అంటూ ప్రారంభించారు. మోదీ తన ప్రసంగం చివర సభికులను సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులను ప్రసరింపజేయాలని అభ్యర్థించారు. ఆ మేరకు సభికులంతా మోదీకి టార్చ్ చూపించగా, ఈ వెలుగులు ఢిల్లీలో అంధకార గదుల్లో దాక్కుని వున్న ఇండియా కూటమి నేతలకు వణుకు పుట్టిస్తాయని వ్యాఖ్యానించారు. ఇదిలా వుండగా ఈ సభలో ఎన్డీయే అభ్యర్థులు నయినార్ నాగేంద్రన్ (తిరునల్వేలి) పొన్ రాధాకృష్ణన్ (కన్నియాకుమారి) జాన్ పాండ్యన్ (తెన్‌కాశి), విజయశీలన్ (తూత్తుకుడి) రాధిక శరత్‌కుమార్ (విరుదునగర్) విలవంగోడు శాసనసభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నందిని, సినీనటుడు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో శాశ్వత ప్రధానిగా మోదీ

● చిదంబరం వ్యాఖ్యలు



అడయార్, ఏప్రిల్ 15: ఒకే దేశం, ఒకే ఎన్నికలు (జమిలి) విధానం దేశంలో అమల్లోకి వస్తే నరేంద్ర మోదీ దేశ శాశ్వత ప్రధాని అవుతారని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అన్నారు. ఆయన సోమవారం కారైక్కుడిలో విలేకరులతో మాట్లాడుతూ... బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఇంటింటికీ వంట గ్యాస్ పథకం అమలు అసాధ్యమన్నారు. బుల్లెట్ రైలు కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నారని, ఈ తరహా రైళ్లు కేవలం ధనికులకు మాత్రమే ఉపయోగపడతాయన్నారు. సాధారణ, మధ్య తరగతి ప్రయాణికుల గురించి బీజేపీ ఆలోచించడం లేదన్నారు. పదేళ్లుగా ప్రవేశపెట్టిన బీజేపీ బడ్జెట్ కోటీశ్వరులను దృష్టిలో ఉంచుకున్నవేనని విమర్శించారు. బడా పారిశ్రామికవేత్తలకు రూ.10.41 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని, కానీ, చిన్న సన్నకారు రైతులతో పాటు పేద విద్యార్థులు తీసుకున్న రుణాలు ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదన్నారు. ఎన్నికల ఫిర్యాదులపై ఎన్నికల సంఘం అధికారులు పక్షపాతం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా 4 కోట్ల గృహాలను నిర్మించినట్టు బీజేపీ ప్రకటించిందనీ, ఆ ప్రకారంగా చూస్తే ప్రతి జిల్లాలో 52 వేల ఇళ్ల నిర్మాణం జరగాలన్నారు. అయితే, ఆచరణలో అవి కనబడడం లేదన్నారు. దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల విధానం ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవని చిదంబరం వ్యాఖ్యానించారు.

మోదీ మళ్లీ గెలిస్తే నిరంకుశ పాలనే

● డీఎంకే ఎంపీ కనిమొళి



ప్యారీస్, ఏప్రిల్ 15: ప్రధాని నరేంద్రమోదీ మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే నిరంకుశ పాలన అమల్లోకి వస్తుందని డీఎంకే ఎంపీ కనిమొళి వ్యాఖ్యానించారు. తూత్తుకుడి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని తిరుచెందూర్, కాయల్‌పట్టి తదితర ప్రాంతాల్లో ఆమె సోమవారం ఉదయం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ... సీఏఏ చట్టం ద్వారా ప్రజలను విభజించాలని నిర్ణయించిన బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని మతవాద బీజేపీ ప్రస్తుతం ఓట్ల రాజకీయాలు సాగిస్తూ మూడో సారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందన్నారు. సామాన్యుల సంక్షేమం పట్టని ఎన్డీఏ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి శ్రీమంతులకు అండగా ఉంటూ చిన్న పరిశ్రమల మూసివేతకు కారణమైందన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిని గెలిపిస్తే దేశంలో పేదరికాన్ని నిర్మూలించవచ్చని, మహిళలకు సంవత్సరానికి రూ.లక్ష పంపిణీ జరుగుతుందని, 100 రోజుల ఉపాధి హామీ పథకం పనులను 150 రోజులుగా పొడిగిస్తారని, ఇందులో పాల్గొనే కార్మికులకు రోజుకు వేతనంగా రూ.400 అందుతుందని, ఇవన్నీ నెరవేరాలంటే కాంగ్రెస్ అభ్యర్థులకు 'హస్తం', డీఎంకే అభ్యర్థులకు 'ఉదయించే సూర్యుడు' గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కనిమొళి అభ్యర్థించారు.

రేపు సాయంత్రం
6 గంటల వరకు ప్రచారం

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు



మీడియాతో మాట్లాడుతున్న సత్యప్రదసాహు

ప్యారీస్, ఏప్రిల్ 15: లోక్ సభ సార్వత్రిక ఎన్నికల ప్రచా రం బుధవారం సాయంత్రం 5 గంటలకు బదులుగా 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు పేర్కొన్నారు. సచివాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సుమారు 190 కంపెనీల పారా మిలటరీ బలగాలు భద్రతా విధుల్లో పాల్గొంటున్నాయన్నారు. 61,101 మంది పోలీసులు పోస్టల్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 26,247 మంది వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఓట్లు నమోదు చేశారని తెలిపారు. 100 శాతం పోలింగ్ నమోదు కావాలన్న లక్ష్యంతో ఎన్నికల సంఘం తరపున విద్యార్థులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 18న బుధవారం వారికి కేటాయించిన ప్రాంతాల్లో పోస్టల్ ఓటు వెయ్యవచ్చని, ఈ ఓట్లను భారీ పోలీసు బందోబస్తుతో తిరుచ్చిలో ఉన్న సమైక్య పోస్టల్ ఓట్ల కేంద్రానికి తరలిస్తామన్నారు. సైనికులు మాత్రం జూన్ 4వ తేది ఓట్ల లెక్కింపు ప్రారంభించే వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 92.80 శాతం బూత్ స్లిప్పులను ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలతో ఈ పనులు పూర్తవుతాయన్నారు. సహజంగా ఎన్నికల ప్రచారం చివరి రోజున సాయంత్రం 5 గంటల వరకే అనుమతి ఉండేదని, ఎగటి ఉష్ణోగ్రతలు బాగా పెరిగిన కారణంగా గంట పొడిగించినట్లు తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి సి-విజిల్ ద్వారా ఇప్పటి వరకు 4,100కు పైగా ఫిర్యాదులందాయని, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటివరకు బూత్ స్లిప్పులు పంపిణీ చేయలేదని పలువురు ఫిర్యాదు చేశారని అయితే, ఓటరు జాబితాలో పేరున్న వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ రోజు న సెలవు ప్రకటించని ప్రైవేటు సంస్థలపై 18వ తేదిలోపు 1950 అనే టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు చేపట్టనున్నట్లు సత్యప్రదసాహు మీడియాకు తెలిపారు.

డీఎంకే పాలనలో
పెరిగిన నిత్యావసరాల ధరలు

● కంచి సభలో ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 15: డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై అదనంగా ఆర్థికభారం పడిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. కాంచీపురం లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి పెరుంబాక్కం రాజశేఖరన్‌కు మద్దతుగా సోమవారం ఉదయం ఆలయాల నగరం కాంచీపురంలో ఈపీఎస్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంచీపురం జిల్లాలో వ్యవసాయం, పట్టువస్త్రాల ఉత్పత్తి, హ్యాండ్‌లూమ్ ప్రధాన వృత్తులుగా ఉన్నాయని, శ్రామికవర్గాలు పెద్దసంఖ్యలో ఉన్న ఈ ప్రాంతంలో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ఆ తర్వాత కనిపించలేదన్నారు. డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పట్టువస్త్రాల ఎగుమతి పడిపోయిందని, సాగునీటి పథకాలను సక్రమంగా అమలు చేయని కారణంగా వేలాది ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంతానికి ఎందరో రాజకీయ నాయకులు వచ్చి వెళ్తుంటారని అయితే, ప్రజలకు అంకితభావంతో సేవ చేసేది ఒక్క అన్నాడీఎంకే మాత్రమేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై జన్మించిన ఈ భూమిలో నివసిస్తున్న ప్రజలు తమకు మేలుచేసే పార్టీల వైపే మొగ్గు చూపుతుంటారన్నారు. దేశంలోనే తమిళనాడు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ చెబుతున్నారని, వాస్తవానికి ఒక్క కాంచీపురం జిల్లాలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే అది నిజం కాదని గ్రహించవచ్చన్నారు. చెరువులు అధికంగా ఉన్న ఈ జిల్లాలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మణిమంగళంలో తాగునీటి ప్రాజెక్ట్ ప్రారంభించానని, దీని వల్ల 14 వేలకు పైగా చెరువుల్లో నీరు సమృద్ధిగా నిల్వ ఉండేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.1,240 కోట్లతో ప్రజలు, రైతుల సహకారంతో 6,211 చెరువుల్లో పూడిక తీశామన్నారు. ఈ పుణ్యభూమిలో 40 ఏళ్లకు ఒకసారి అత్తివరదర్ స్వామివారు ప్రజలకు 40 రోజులు దర్శన భాగ్యం కల్పించారని, అన్నాడీఎంకే అధికారంలో ఉన్న సమయంలో ఈ మహోత్సవం కోలాహలంగా జరగ్గా, సుమారు 60 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్న సంఘటన ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతోందన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే అన్నాడీఎంకే అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్పిన్నింగ్ మిల్లులు, మరమగ్గాల నిర్వాహకుల నుంచి పీక్ అవర్ పేరుతో అధిక ఛార్జీల భారం మోపారని మండిపడ్డారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలొస్తాయని, ఈ మూడేళ్ల పాలనలో కిలో బియ్యం రూ.18 పెరగడం అందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చని కారణంగా ఈ ప్రాంతంలో నిరుద్యోగుల సంఖ్య కూడా పెరిగిందని ఈపీఎస్ ధ్వజమెత్తారు.





ప్రజలకు అభివాదం చేస్తున్న పళనిస్వామి

పుదుచ్చేరికి రాష్ట్ర హోదా లేదా?

● కేంద్రాన్ని ప్రశ్నించిన ఖర్గే



ప్రసంగిస్తున్న ఖర్గే

పుదుచ్చేరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పుదుచ్చేరికి రాష్ట్ర స్థాయి హోదా కల్పించే విషయంపై ఎలాంటి ప్రస్తావన లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పుదుచ్చేరిలో సోమవారం మధ్యాహ్నం కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగానికి మద్దతుగా ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగసామిని చూస్తే జాలి కలుగుతోందన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి కోసం ఏ పనులు చేయలేని, కేంద్ర ప్రభుత్వానికి సలాం కొట్టే బొమ్మలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పుదుచ్చేరిలో గవర్నర్ ద్వారా పాలను సాగించిన మోదీ ప్రభుత్వం తమిళనాట అక్కడి గవర్నర్‌తో పోటీ ప్రభుత్వాన్ని నడిపేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపాదించే బిల్లులకు అడుగడుగునా అడ్డంకులు చెబుతూ పరిపాలనను స్తంభింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇండియా కూటమికి దేశవ్యాప్తంగా లభిస్తున్న ప్రజాదరణను చూసి ఎన్డీయే కూటమి ఆందోళన చెందుతోందన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిస్తే పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పిస్తామని, రేషన్‌షాపులు తెరిపిస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యేడాదికి 30లక్షల మందికి ఉద్యోగవకాశాలు కల్పిస్తామంటూ చేసిన హామీపై దేశ యువత స్పందిస్తోందన్నారు. కొత్త ఓటర్లు ఇండియా కూటమివైపే మొగ్గు చూపటం ఖాయమన్నారు.

సమాచార ధ్వని

రేపు శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం

ప్యారీస్, ఏప్రిల్ 15: స్థానిక కొరట్టూరు అగ్రహారం రామాలయం వీధి అన్నై అవెన్యూలో కొలువై ఉన్న కోదండ రామాలయంలో ఈనెల 17న సీతారామ కల్యాణ మహోత్సవం జరగనుంది. ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో 35వ సంవత్సరం వేడుకగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు భజన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ జరుగుతుందని స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ ప్రకటించారు.

మద్రాసు చిల్లీస్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

మద్రాసు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతారామ కల్యాణ మహోత్సవం జరగనుంది. జార్జిటౌన్‌లోని ఆదియప్ప నాయకర్ వీధిలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాలులో ఉదయం 6 గంటలకు నాదస్వరం, 7 గంటలకు వినాయక పూజ, 7.30 గంటలకు వేంకటేశ్వర సుప్రభాతం, 9.45 నుంచి మధ్యాహ్నం 11.45 గంటల్లోపు పురోహితులు వడ్డి వెంకటేశ్వర్లు శాస్త్రి బృందం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరగనుంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మాధవయ్య, శ్రీ సీతారామ నవమి ఉత్సవ కమిటీ ఛైర్మన్ పి.ధనుంజయ నాయుడు ఈ మేరకు ప్రకటించారు.

26 వరకే పాఠశాలలకు పనిదినం

ఐసిఎఫ్, ఏప్రిల్ 15: ఈ విద్యా సంవత్సరం ఆఖరి పనిదినంగా ఈ నెల 26వ తేదీని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అలాగే 24 నుంచి 26వ తేది వరకు పాఠశాలలు పని చేస్తాయని పేర్కొంది. ఈనెల 13 నుంచి పాఠశాల విద్యార్థుల పరీక్షలు ముగిసిన నేపథ్యంలో, 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. అయినప్పటికీ, 15, 16, 17 తేదీల్లో ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలలకు హాజరుకావాల్సి ఉంది. 18, 19 తేదీల్లో ఉపాధ్యాయులకు ఎన్నికల పనులు, 20, 21 తేదీలు సెలవులు, 22, 23 తేదీల్లో కింది తరగతులకు సైన్స్, సోషల్ పరీక్షలు, 4 నుంచి 8వ తరగతి విద్యార్థులకు 24వ తేదీనుంచి వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో పాఠశాలలు పనిచేస్తాయి.

23న మదురై జిల్లాకు స్థానిక సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 15: మదురై జిల్లా ఈనెల 23వ తేది స్థానిక సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో జరిగే ఉత్సవాల్లో మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ చిత్తిరై ఉత్సవాలు ప్రసిద్ధిగాంచాయి. ఏడాది పొడవునా 12 నెలలు ఈ ఆలయంలో వివిధ ఉత్సవాలు నిర్వహించినప్పటికీ, చిత్తిరై ఉత్సవాలు ప్రత్యేకమైనవి. ఈ ఉత్సవాల అనంతరం కళ్లలగర్ నదిలో దిగే ఉత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ సందర్భంగా 23వ తేది మదురై జిల్లాకు కలెక్టర్ సంగీత సెలవు ప్రకటించారు. ఆ రోజుకు బదులుగా మే 11వ తేది పనిదినంగా ప్రకటించారు.

విమాన ఛార్జీల పెంపు

ఐసిఎఫ్, ఏప్రిల్ 15: వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో చెన్నై నుంచి ముంబై, కోల్‌కత్తా వంటి నగరాలకు విమాన ఛార్జీలు పెంచారు. చెన్నై నుంచి అండమాన్, ఢిల్లీ, ముంబై సహా వివిధ నగరాలకు వెళ్లే విమాన టిక్కెట్ల బుకింగ్ ప్రారంభమైంది. చెన్నై నుంచి అండమాన్‌కు రూ.6,500 నుంచి రూ.10,200, గోవాకి రూ.4,500 నుంచి రూ.5,200, ముంబైకి రూ.4,700 నుంచి రూ.7,000, శ్రీనగర్ రూ.12,000 నుంచి రూ.17,000, కోల్‌కత్తా రూ.6,700 నుంచి రూ.9,000, కొచ్చిన్ రూ.3,200 నుంచి రూ.8,000 వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదే విధంగా అన్ని ప్రాంతాల టిక్కెట్టు ధరలు పెరిగాయి.

● బంపర్ ఆఫర్

ఓటు వేసిన వారికి హోటళ్లలో 5 శాతం రాయితీ

పెరంబూర్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా ఎన్నికల కమిషన్ పలు అవగాహన ప్రచారాలు చేపడుతోంది. అందులో భాగంగా కాంచీపురం జిల్లా కలెక్టర్ వినూత్న ప్రకటన చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన వారు హోటల్‌లో టిఫిన్, భోజనం చేస్తే 5 శాతం తగ్గింపు ఉంటుంది. ఆ ప్రకారం, ఈ నెల 19వ తేది ఓటు హక్కు వినియోగించుకున్నవారు, ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంలో మహాబలిపురంలో ఉన్న హోటళ్లలో ఈ రాయితీ పొందవచ్చు. ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అక్కడి హోటల్ యజమానులతో సమావేశమై నిర్ణయించారు. అదే సమయంలో ఓటు వేసినట్టు వేలిపై సిరా గుర్తు ఉండాలి. పోలింగ్ ముగిసిన మరుసటిరోజు (ఈనెల 20)వ తేది ఈ రాయితీని పొందవచ్చని కలెక్టర్ కార్యాలయం తెలిపింది.

మహిళా ప్రోత్సాహక నిధి అందజేత

పెరంబూర్, ఏప్రిల్ 15: కుటుంబ మహిళకు ప్రతి నెలా అందించే రూ.1,000 లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో సోమవారం జమ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మహిళలకు అందించే ప్రోత్సాహక నిధి ఈ నెల జమవుతుందా అనే సందేహం నెలకొంది. ఈ నేపథ్యంలో, ఎన్నికల సంఘం అనుమతితో సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఇప్పటివరకు కోటీ 6 లక్షలా 50 వేల మందికి ఈ నిధి అందిస్తుండగా, తాజాగా ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెలలో నగదు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ పథక లబ్ధిదారుల సంఖ్య కోటీ 7 లక్షలా 70 వేలకు పెరిగినట్లు ప్రభుత్వం తెలిపింది.

ఎన్నికల ఉద్యోగుల వేతనాలకు రూ.58 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 15: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు వేతనాల కోసం రూ.58.58 కోట్లను కేటాయించారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ నెల 19వ తేది ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం 68,000 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఒక్కో పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారి, అసిస్టెంట్లు అని ఆరుగురు విధులు నిర్వహించనున్నారు. వీరిలో పోలింగ్ అధికారికి రూ.1,700, మిగిలిన వారికి రూ.600 అందించనున్నారు.

అన్నాడీఎంకే బైక్ ర్యాలీ

వేలూరు, ఏప్రిల్ 15: వేలూరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి పసుపతికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అనైకులత్తమ్మన్ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని వేలూరు కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ అప్పు ప్రారంభించారు. ఈ ర్యాలీ సాయినాథపురం, విరుపాక్షిపురం, తొరప్పాడి, ఆర్ఎన్ పాళయం, సేన్‌పాక్కం, తోటపాళ్యం, సత్తువాచేరి మీదుగా సాగింది. ర్యాలీలో పార్టీ డివిజన్ సెక్రటరీలు కుప్పుస్వామి, సూలై ఆనందన్, రాజవేలు, కార్తికేయన్, శివసుబ్రమణ్యన్ సహా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతంగా సిక్స్ రెడ్ స్నూకర్ పోటీలు

● విజేతలకు ట్రోఫీల బహూకరణ


విజేతలతో స్నూకర్ ఛాంపియన్లు అనుపమ, శ్రుతి తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 15: స్థానిక జార్జిటౌన్ గిడ్డంగి వీధిలోని సదరన్ ఇండియా వైశ్య సంఘం (శివా) ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన సిక్స్ రెడ్ స్నూకర్ పోటీలు ముగిశాయి. శివా అధ్యక్షుడు అజంతా అధినేత డాక్టర్ కనిగెలుపుల శంకరరావు శనివారం ప్రారంభించిన ఈ పోటీల్లో 35 మందికి పైగా పాల్గొని సత్తా చాటారు. ఆదివారం రాత్రి 8 గంటలకు జరిగిన ముగింపు కార్యక్రమంలో స్నూకర్ వరల్డ్ ఛాంపియన్ అనుపమ రామచంద్రన్, జాతీయ ఛాంపియన్ శ్రుతి లక్ష్మీనారాయణలు పాల్గొని విజేతలకు షీల్డులు, ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో అజంతా శంకరరావు, సంయుక్త కార్యదర్శులు పువ్వాడ అశోక్‌కుమార్, మద్ది నరసింహులు, కోశాధికారి పెనల రమేష్, టోర్నీ కో-ఆర్డినేటర్ రామ్‌నారాయణ, డైరెక్టర్ పేరూరు విజయ్‌కుమార్, శివా ఉపాధ్యక్షుడు మన్నారు ఉదయకుమార్, కమిటీ సభ్యుడు కేకే త్రినాథ్‌కుమార్, ఏవీ వాసు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

డీఎంకే అభ్యర్థి విజయం కోసం ప్రత్యేక పూజలు


ఎమ్మెల్యే నందకుమార్‌కు ఆహ్వానం పలుకుతున్న ఆలయ అధికారులు, పూజారులు

వేలూరు, ఏప్రిల్ 15: వేలూరు నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కదిర్ ఆనంద్ విజయం సాధించాలని కోరుతూ సోమవారం జలకంఠేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్, జిల్లా పంచాయతీల అధ్యక్షుడు బాబు, వేలూరు డివిజన్ సెక్రటరీ ఉమాపతి, వసంతనడై పంచాయతీ అధ్యక్షుడు రుద్రమూర్తి సహా పలువురు నేతలు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే నందకుమార్‌కు ఆలయ సెక్రటరీ సురేష్ అధ్యక్షతన అర్చకులు స్వాగతం పలికారు.

నటుడు మన్సూర్ అలీఖాన్ వినూత్న ప్రచారం



వేలూరు, ఏప్రిల్ 15: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో ఇండియన్ పులి పడై ఇయక్కం అధ్యక్షుడు, సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ పోటీ చేస్తున్నారు. ఆయన సోమవారం గుడియాత్తంలో వినూత్న ప్రచారం చేపట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వెదురు కర్రలు, కొబ్బరి మట్టలతో తయారు చేసిన చాపలపై నిలబడి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో ప్రజాదరణతో తన విజయం తథ్యమన్నారు. ఆయన వెంట పార్టీ నిర్వాహకులు రమేష్, వేడియప్పన్, సుందరమూర్తి తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా సుందర్ సి. ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న దర్శకుడు సుందర్

వేలూరు, ఏప్రిల్ 15: వేలూరు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగానికి మద్దతుగా సినీ దర్శకుడు సుందర్ సి. ప్రచారం చేశారు. తిరుపత్తూర్ జిల్లా దేవాలయపురంలో జరిగిన ప్రచారంలో సుందర్ మాట్లాడుతూ... ఏసీ షణ్ముగాన్ని గెలిపిస్తే ప్రభుత్వ నిధులకు ఎదురుచూడకుండా సొంత ఖర్చుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఉచిత వైద్యశిబిరాలు, జాబ్‌మేళాలు సహా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆయన్ను గెలిపించుకుంటే సమస్యలు తీరుతాయని చెప్పారు.

12వ శతాబ్దం నాటి శిలాఫలకాలు లభ్యం


లభ్యమైన శిలా ఫలకం

వేలూరు, ఏప్రిల్ 15: తిరుపత్తూర్ తూయ నెంజై కళాశాల లెక్చరర్ మోహన్ గాంధీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వెంకటేశన్, పరిశోధకుడు మునుస్వామి... జవ్వాది కొండల్లో పరిశోధనలు చేపట్టారు. పెరుంపల్లి, కల్లావూరు తదితర గ్రామాల్లో చేపట్టిన పరిశోధనల్లో మూడు రాతి శిలాఫలకాలను ఈ బృందం గుర్తించింది. ఇది క్రీ.పూ 12వ శతాబ్దానికి చెందినవి తెలిపారు. ఆ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో మృతి చెందిన ఊరి అధ్యక్షుడు జ్ఞాపకార్థంగా ఈ శిలాఫలకాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శిలాఫలకంలో వీరుడు శరీరంలో 6 బాణాలున్నాయని, లిపిని బట్టి అతని పేరు ఎన్నాన్ అని వారు పేర్కొన్నారు.

సినీ స్టంట్ కళాకారుడి నివాసంలో చోరీ

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూవాషర్‌మెన్‌పేట జైసింగ్ నగర్‌లో అన్బళగన్ అనే స్టంట్ కళాకారుడి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.3లక్షల నగదు, నగలను చోరీ చేశారు. అన్బళగన్ భార్యతో కలిసి ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ దేవాలయానికి వెళ్లాడు. రాత్రి పది గంటలకు తిరిగొచ్చినప్పుడు ఇంటి తలుపులు తెరచి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూవాషర్‌మెన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఇంట్లో బీరువా తలుపులు పగులొట్టి అందులో భద్రపరచిన రూ.3లక్షల నగదు, నగలు చోరీకి గురైనట్టు అన్బళగన్ ఫిర్యాదు చేశారు.

మెట్రో టిక్కెట్లు పొందడంలో ఇబ్బందులు

పెరంబూర్, ఏప్రిల్ 15: సాంకేతికలోపం కారణంగా వాట్సాప్ ద్వారా మెట్రోరైలు టిక్కెట్లు పొందలేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మెట్రోరైలు అధికార వెబ్‌సైట్, పే టీఎం, సింగార చెన్నై కార్డు, సీఎంఆర్ఎల్ ట్రావెల్ కార్డుల ద్వారా టిక్కెట్లు పొందవచ్చు. అలాగే, వాట్సాప్ ద్వారా ఈ వసతి కల్పించారు. కానీ, సోమవారం వాట్సాప్ ద్వారా టిక్కెట్లు పొందడంలో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సాంకేతికలోపంతో ఈ విధానం పనిచేయలేదని, త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని సీఎంఆర్ఎల్ తెలిపింది.

వైద్యకళాశాలలకు అనుమతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 15: కొత్త వైద్యకళాశాలలు ప్రారంభించేందుకు, వైద్య సీట్లు పెంచేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చింది. కొత్త కళాశాలలు ప్రారంభించేందుకు అనుమతివ్వాలని కోరుతూ కళాశాలలు ఎన్ఎంసీకి దరఖాస్తు చేసుకున్నాయి. వాటిని పరిశీలించి అర్హత కలిగిన కళాశాలలకు ఆమోదపత్రాలు పంపినట్లు అధికారులు తెలిపారు.

మంత్రి దురైమురుగన్ ఆశీస్సులు కోరిన పీఎంకే అభ్యర్థి


మంత్రి దురైమురుగన్‌ను చూస్తూ ప్రసంగిస్తున్న పీఎంకే అభ్యర్థి బాలు

పెరంబూర్, ఏప్రిల్ 15: అరక్కోణం లోక్‌సభ నియోజకవర్గ పీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలు సోమవారం వేలూరు జిల్లా కాట్పాడి సమీపం వెల్లిమలైలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే, ఈ నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేస్తున్న జగద్రక్షకన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ ప్రచారం ముగించుకొని వేలూరుకు బయల్దేరాడు. వెల్లిమలై ప్రాంతంలో ప్రచారం చేస్తున్న పీఎంకే అభ్యర్థి బాలు వాహన సమీపంలో మంత్రి వాహనం కూడా వెళ్లింది. కారులో మంత్రిని గమనించిన బాలు 'నాకు మురుగన్ ఆశీర్వాదం లభించిందని, ఈ ఎన్నికల్లో తాను విజయం సాధించనున్నానని, నా ప్రచారాన్ని మీరు గమనించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, నేను విజయం సాధించిన తర్వాత మీ వద్దకు వచ్చి ఆశీస్సులు తీసుకుంటానని' మైక్‌లో తెలిపారు. బాలు మాటలు విన్న దురైమురుగన్ నవ్వుతూ అక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు.

ప్రభుత్వ బస్సు నుంచి జారిన ఫుట్ బోర్డు


కింద పడిన ఫుట్ బోర్డును తీసుకెళ్తున్న డ్రైవర్, కండక్టర్

పెరంబూర్, ఏప్రిల్ 15: ప్రభుత్వ బస్సు ఫుట్ బోర్డు హఠాత్తుగా కింద పడింది. విరుదునగర్ జిల్లా రాజపాళయం పాత బస్టాండ్ నుంచి సోమవారం మధ్యాహ్నం 1 గంటకు ముడంగియారులో ఉన్న ప్రైవేటు కళాశాల వరకు వెళ్లే టౌన్ బస్సు బయల్దేరించి. సాధారణ బస్సు కావడం, మహిళలకు ప్రయాణం ఉచితం కావడంతో బస్సు ప్రయాణికులతో నిండింది. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వెళ్తుండగా బస్సు వెనుక ఫుట్ బోర్డు ఊడి కిందపడింది. ఆ సమయంలో ఫుట్ బోర్డు పైన, సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. దీంతో, డ్రైవర్, కండక్టర్లు బస్సులను గమ్యస్థానానికి చేర్చి ముందు వైపు నుంచి ప్రయాణికులను సురక్షితంగా దించిన అనంతరం తిరుగుప్రయాణంలో కింద పడిన ఫుట్ బోర్డు బస్సుల్లో ఎక్కించుకొని వెళ్లారు.

అంపా స్కైవాక్‌కు అభినందన



అడయార్, ఏప్రిల్ 15: ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ఎన్నికల సమగ్రతను పెంపొందించేందుకు అమింజికరైలోని అంపా స్కైవాక్‌లో వినూత్న కార్యక్రమం జరిగింది. ఇందులో జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఆర్.అరవిందన్ పాల్గొన్నారు. ఓటు వేయడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా తమ మాల్‌కు వచ్చే వినియోగదారులకు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఉచిత పార్కింగ్ సదుపాయాన్ని కల్పించినట్టు అంపా స్కైవాక్ మాల్ సెంటర్ హెడ్ ప్రభాకరన్ తెలిపారు.

ప్రశాంత్ హాస్పిటల్‌లో ఓటింగ్‌పై అవగాహన



అడయార్, ఏప్రిల్ 15: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన ప్రశాంత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 19న జరిగే ఓటింగ్‌లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు వీలుగా ఓటింగ్ అవేర్నెస్ డ్రైవ్‌ను సోమవారం నిర్వహించారు. ప్రజలు ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంత్ హాస్పిటల్స్ సిబ్బందితో పాటు అంబత్తూరులోని అన్నై వైలెట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీనిక్స్ మాల్‌లో వీకెండ్ వినోదం



అడయార్, ఏప్రిల్ 15: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ మాల్స్‌లో ఒకటిగా ఉన్న ఫీనిక్స్ మాల్‌లో వీకెండ్, హాలిడే ల్యాండ్ డెకర్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 'ట్రోల్స్' మూవీ ఫ్రాంఛైజీ నుంచి ప్రేరణ పొంది శక్తివంతమైన 'వేకేషన్ ఐలాండ్' థీమ్‌తో సందర్శకులను మంత్ర ముగ్ధులను చేసే విధంగా 'కాలిడోస్కోప్ డోమ్'ను ఏర్పాటు చేశారు. అలాగే ప్రఖ్యాత ఇల్యూషనిస్ట్ శరణ్ కట్టప్ప అందించిన మ్యాజిక్ షో సందర్శకులను అలరిస్తోంది. దీంతో ఈ మాల్‌లో వీకెండ్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

ఘనంగా శ్రీ కోధి నామ ఉగాది వేడుకలు


వివిధ వేషధారణలో చిన్నారులు

పెరంబూర్, ఏప్రిల్ 15: ఉత్తర మద్రాసు ఉగాది మహోత్సవ కార్యనిర్వాహక వర్గం, సర్ త్యాగరాయ కళా పరిషత్ చెన్నపట్నం సం యుక్త ఆధ్వర్యం లో శ్రీ కోధి నామ సంవత్సర వేడుక లు ఘనంగా జరిగాయి. పాత చాకలిపేట నమశ్శివాయ వీధిలో ఉన్న దేవాంగ సంఘం కన్నికలమ్మ ఆలయంలో సూరాతి సిస్టర్స్ విద్యాధరి, విహారిక ప్రార్థనా గీతంతో ప్రారంభమైన వేడుకల్లో శ్రీ కృష్ణ గీతా సమాజం ఆధ్వర్యంలో గీతా పారాయణం, మానెల్లూరు శ్రీదేవి మాధవయ్య పంచాంగ పఠనం జరిగాయి. వేడుకలకు సూరాతి హనుమంతరావు అధ్యక్షత వహించగా, డాక్టర్ పి.నందివర్మన్, ఎమ్మార్ సుబ్రమణ్యం అతిథులను పరిచయం చేశారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా గుడిమెట్ల చెన్నయ్య, అల్లింగం రాజశేఖర్, విశిష్ట అతిథిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త కాట్న శ్రీనివాసులు పాల్గొన్నారు. తెలుగును బతికించుకుందామని, తల్లిదండ్రులు తమ పిల్లలకు మాతృభాషను నేర్పడంతో పాటు ఇంట్లో అందరూ తెలుగులో మాట్లాడాలని అతిథులు పిలుపునిచ్చారు. వక్తృత్వ, వ్యాసరచన, వేషధారణ పోటీల విజేతలకు చిన్నారులకు అతిథులు, నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అనంతరం చందూస్ నాట్యాలయం కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం, ఇతర వినోద కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మద్రాసు హైకోర్టు న్యాయవాది జక్కుల హరికృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకల్లో సూరాతి హనుమంతరావు, సూరాతి బలరాం, పుమ్మిటి శ్రీనివాసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి క్లీన్‌స్వీప్

● ఏబీపీ - సీ ఓటర్ సర్వే వెల్లడి

అడయార్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో అధికార డీఎంకే క్లీన్‌స్వీప్ చేస్తుందని ఏబీపీ - సీ ఓటర్ సర్వే తాజాగా వెల్లడించింది. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈనెల 19వ తేదీన రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని కూటమి విజయభేరీ మోగిస్తుందని ఈ సర్వే సంస్థ తెలిపింది. 39కి 39 ఎంపీ సీట్లను ఈ కూటమి కైవసం చేసుకుంటుందని పేర్కొంది. ఈ కూటమికి ఏకంగా 52 శాతం మేరకు ఓటింగ్ శాతం వస్తుందని, అన్నాడీఎంకే కూటమికి 23 శాతం, బీజేపీ కూటమికి 19 శాతం చొప్పున ఓట్లు వస్తాయని ఈ సర్వే వెల్లడించింది. ఈ ఎన్నికల్లో ఓట్ల షేరింగ్‌లో రెండో స్థానానికి వస్తామని కలలు కంటున్న బీజేపీ నేతల ఆశలు ఫలించే అవకాశాలు లేవని తెలిపింది.

ఎన్నికల ప్రచారానికి అనుమతి నిరాకరణ

● కోర్టుకెక్కిన డీఎంకే

అడయార్, ఏప్రిల్ 15: ప్రచారానికి అనుమతివ్వకుండా రాష్ట్ర స్థాయి ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాల్ని వ్యతిరేకిస్తూ అధికార డీఎంకే మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఈనెల 17వ తేదీలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుగా అనుమతి పొందాల్సి వుంది. వాటిపై ఈసీ అధికారులు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. దేశాన్ని పరిరక్షించేందుకు స్టాలిన్‌ను ఆహ్వానిస్తున్నాం పేరుతో డీఎంకే ఒక ప్రచార బ్యానర్‌ను సిద్ధం చేసి, దానికి ఎన్నికల సంఘం అనుమతి కోరింది. అయితే, ఇలాంటి ప్రచారానికి లేనిపోని కారణాలు చూపించి అనుమతివ్వడం లేదు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ డీఎంకే సీనియర్ నేత ఆర్ఎస్ భారతి హైకోర్టులో పిటిషన్ వేశారు. డీఎంకే ప్రచారానికి అనుమతులు ఇవ్వడానికి ఎన్నికల సంఘం ఆరు రోజుల వరకు సమయం తీసుకుంటోంది. ఇలా ఎక్కువ రోజులు తీసుకోవడం ఉద్దేశపూర్వకంగా చేస్తోంది. ఎన్నికల సంఘం నిర్భయంగా, న్యాయంగా, పక్షపాతం లేకుండా నడుచుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపుర్‌వాలా, న్యాయమూర్తి సత్యనారాయణలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించి ఈనెల 17వ తేదీలో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరు యువకుల మృతి

ప్యారీస్, ఏప్రిల్ 15: స్థానిక క్రోంపేట సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. సేలవాయల్ అగరం ప్రాంతానికి చెందిన హరిప్రసాద్ (25) క్రోంపేటలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున విధులు ముగించుకొని బైక్‌లో ఇంటికి తిరుగుముఖం పట్టాడు. అతను క్రోంపేట జీఎస్‌టీ రోడ్డు క్షయ ఆసుపత్రి సమీపంలోని సిగ్నల్ వద్ద యూ టర్న్ చేస్తుండగా తాంబరం నుంచి క్రోంపేటకు వేగంగా వెళుతున్న మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో హరిప్రసాద్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మరణించగా, మరో బైక్‌లో వచ్చిన టి.నగర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్‌కుమార్ (23) తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. క్రోంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

ప్యారీస్, ఏప్రిల్ 15: అక్రమార్జన కేసులో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని గత ఏడాది జూన్ 14న ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ కేంద్ర కారాగారంలో బందీగా ఉన్న సెంథిల్ బాలాజీ జ్యుడిషియల్ కస్టడీ సోమవారంతో పూర్తయిన నేపథ్యంలో, 32వ సారి ఆయన కస్టడీని పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. పుళల్ కేంద్ర కారాగారం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై ప్రిన్సిపల్ న్యాయమూర్తి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను ఈ నెల 17వ తేది వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జేపీ నడ్డా ఊటీ రోడ్ షో రద్దు

ప్యారీస్, ఏప్రిల్ 15: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం ఊటీలో పాల్గొనాల్సిన రోడ్ షో వివిధ కారణాల వల్ల రద్దు చేసినట్లు రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయం ప్రకటించింది. ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన రెండు రోజుల ప్రచారంలో అన్ని ప్రధాన పార్టీల అగ్రనేతలు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, నీలగిరి జిల్లా ఊటీలో బీజేపీ అభ్యర్థి ఎల్.మురుగన్‌కు మద్దతుగా జేపీ నడ్డా పాల్గొనే రోడ్ షో రద్దయింది. అయితే సోమవారం సాయంత్రం పుదుచ్చేరిలో, మంగళవారం రామనాథపురంలో పన్నీర్‌సెల్వంకు మద్దతుగా నడ్డా రోడ్‌షోలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి.

చిన్నారి కిడ్నాప్ కేసు సుఖాంతం

ఐసిఎఫ్, ఏప్రిల్ 15: స్థానిక చెన్నై సెంట్రల్‌లో కిడ్నాప్‌కు గురైన చిన్నారిని నాలుగు గంటల్లో పోలీసులు రక్షించారు. ఈశాన్య రాష్ట్రానికి చెందిన దంపతుల కుమార్తెను ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఈ విషయమై పోలీసులు విచారణ జరపగా, ఎన్నూర్‌లో చిన్నారిని విక్రయానికి బేరం మాట్లాడుతున్నట్లు సమాచారం అందింది. సెంట్రల్ పోలీసుల సమాచారం మేరకు ఎన్నూర్ పోలీసులు కార్తీక్, సెల్వంని అరెస్ట్ చేసి, బాలికను స్వాధీనం చేసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

వడదెబ్బకు ఇద్దరి మృతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 15: వడదెబ్బకు బాలుడు సహా ఇద్దరు మృతి చెందారు. ఈరోడ్ జిల్లా గణపతిపాళయానికి చెందిన నేసలింగం తన కుటుంబసభ్యులతో పళని మురుగన్ ఆలయానికి వెళ్లారు. దర్శనానంతరం మెట్ల మార్గంలో కొండ దిగి వస్తుండగా, ఆయన కుమారుడు విశ్వ స్పృహకోల్పోయాడు. ఆలయ సిబ్బంది వెంటనే బాలుడిని పళని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, వేడచందూర్ అప్పుమేడులో 50 ఏళ్ల వ్యక్తి బస్ షెల్టర్‌లో బస చేస్తూ భిక్షాటన చేస్తుండేవాడు. ఆదివారం సాయంత్రం స్పృహ కోల్పోగా స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని తెలిపారు.

రిటైర్డ్ ఎస్ఐ హత్య : కాల్ ట్యాక్సీ డ్రైవర్ అరెస్ట్

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సేలయూరులో రిటైర్డ్ ఎస్ఐను దారుణంగా హతమార్చిన కాల్‌టాక్సీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సేలయూరు రాజా వీధిలో కృష్ణమూర్తి (60) అనే రిటైర్డ్ ఎస్ఐ నివసిస్తున్నారు. ఆదివారం సాయం త్రం ఆ వీధిలో మద్యం మత్తులో ఊగుతున్న తిరువణ్ణామలై జిల్లాకు చెందిన కాల్‌టాక్సీ డ్రైవర్ శివరామన్‌ను చూసిన మహిళలు కొందరు అతడు ధరించి ఉన్న బంగారు గొలుసు, ఉంగరాన్ని ఎవరైనా దోచుకుంటారని భావించి రిటైర్డ్ ఎస్ఐకి అప్పగించారు. మత్తు దిగిన తర్వాత ఆ నగలను శివరామన్‌కు ఇవ్వమని మహిళలు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న శివరామన్ ముఖంపై కృష్ణమూర్తి మంచినీళ్లు పోసాడు. తేరుకున్న శివరామన్ తన గొలుసు, ఉంగరం కనిపించకపోవడంతో వాటిని కృష్ణమూర్తి దొంగిలించి ఉంటాడని భావించి చితకబాదాడు. ఆ తర్వాత కృష్ణమూర్తి జేబుల్లో ఉన్న బంగారు గొలుసు, ఉంగరాన్ని తీసుకుని పారిపోయాడు. దాడిలో గాయపడిన కృష్ణమూర్తిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక ఆయన మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని డ్రైవర్ శివరామన్‌ను అరెస్టు చేశారు.

● పార్లమెంటు ఎన్నికలు

తమిళనాడులో 20 ఏళ్లుగా గెలవని స్వతంత్రులు

ప్యారీస్, ఏప్రిల్ 15: తమిళనాడు లోక్‌సభ ఎన్నికల్లో ఇరవై ఏళ్లుగా స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన చరిత్ర లేదు. డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటములు ఓట్ల కోసం బహిరంగ సభలు, రోడ్ షో లు, ద్విచక్రవాహన ర్యాలీలు, ఇంటింటా ప్రచారంలో పాల్గొంటున్నాయి. రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో మొత్తం 950 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థులు 609 మంది ఓటర్లను ఆకర్షించేందుకు పలు ప్రాంతాల్లో వినూత్న ప్రచారం సాగిస్తున్నారు. అయినప్పటికీ, రాష్ట్ర ఓటర్లు మాత్రం వారిని పట్టించుకోవడం లేదు. అయితే కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీలకు నిర్వహించిన స్థానిక ఎన్నికల్లో పలువురు స్వతంత్రులు విజయం సాధించి స్థానిక సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. సొంత నిధులను కూడా వెచ్చిస్తున్నారు. 2019 ఎన్నికల్లో మొత్తం 850 మంది అభ్యర్థులు పోటీచేయగా, వీరిలో స్వతంత్రులు 362 మంది ఉండగా, వీరిలో ఒక్క రు కూడా విజయం సాధించలేదు. ఈ నేపథ్యంలో, సేలం నియోజకవర్గం లో సీనియర్ కాంగ్రెస్ నేత వాళప్పాడి కె.రామమూర్తి ఇండిపెండెంట్‌గా లోక్‌సభకు పోటీచేసి విజయం సాధించారు. ఆయన అన్నాడీఎంకే, ఎన్డీఏ మద్దతుతో 1998వ సంవత్సరం కొద్దికాలం పాటు దివంగత ప్రధాని వాజ్‌పేయి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. ఆయన తర్వాత గుర్తింపు కలిగిన రాజకీయ నాయకులెవ్వరూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముందుకు రాలేదు. అయితే 2019 ఎన్నికల్లో పోటీ చేసి 850 మందిలో స్వతంత్ర అభ్యర్థులకు 7.26 శాతం ఓట్లు రావడం గమనార్హం. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కూడా ఇండిపెండెంట్‌గా పోటీ చేయాల్సి వచ్చింది. ఆయన రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తుండడం గమనార్హం.

కళ్ల'కుర్చీ' ఎవరిదో?

● వీఐపీ నియోజకవర్గం

ప్యారీస్, ఏప్రిల్ 15: వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న కళ్లకుర్చి పార్లమెంటు నియోజకవర్గం 14వ స్థానం అవుతుంది. 2008వ సంవత్సరానికి ముందు కడలూరు పేరుతో ఉండేది. పునర్విభజన అనంతరం సేలం జిల్లాలోని ఆత్తూర్ (రిజర్వుడు), గెంగవల్లి (రిజర్వుడు), ఏర్కాడు (రిజర్వుడు) అసెంబ్లీ సెగ్మెంట్లు, కళ్లకుర్చి జిల్లాకు చెందిన కళ్లకుర్చి (రిజర్వుడు), రిషివందియం, శంకరాపురం శాసన సభ నియోజకవర్గాలను కలుపుకొని 2009వ సంవత్సరం కుళ్లకుర్చి పేరుతో లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించింది.

వెనుకబడిన ప్రాంతాలు..

ఆత్తూరు, గెంగవల్లి, ఏర్కాడు, కళ్లకుర్చి, శంకరాపురం ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న నేపథ్యంలో, రైతులకు ఊతమివ్వడం తగ్గిపోవడంతో సాగు గణనీయంగా పడిపోయింది. వెనుకబడిన ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరున్నారు. ఆదిద్రావిడులు, గౌండర్, నాయుడు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరిలో 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు.

మొత్తం ఓటర్లు...

జనవరిలో ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం కళ్లకుర్చి పార్లమెంటు స్థానంలో మొత్తం 15,58,749 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరిలో పురుషులు 7,68,729 మంది కాగా, మహిళలు 7,89,794 మంది, ఇతరులు 226 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 21,000 మంది మహిళా ఓటర్లు అధికం.


మలయరసన్ (డీఎంకే)

పునర్విభజన...

పునర్విభజన అనంతరం 2009వ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి ఆదిశంకర్ గెలుపొందారు. 2014లో అన్నాడీఎంకే అభ్యర్థి కామరాజ్ ఎంపీ అయ్యారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి గౌతమ శిఖామణి ఎంపీగా గెలిచారు. ఈయన రాష్ట్ర సీనియర్ మంత్రి కె.పొన్ముడి కుమారుడు. ఈ స్థానం లోక్‌సభ నియోజకవర్గంగా ఆవిర్భవించక ముందు మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో రెండు సార్లు డీఎంకే, ఒకసారి అన్నాడీఎంకే గెలిచాయి.


కుమరగురు (అన్నాడీఎంకే)

సిట్టింగ్ ఎంపీ పనితీరు...

డీఎంకే సిట్టింగ్ ఎంపీ గౌతమ శిఖామణి పార్లమెంటు సమావేశాల్లో 52 చర్చల్లో పాల్గొన్నారు. ఆయన నియోజకవర్గంలో తిష్ట వేసిన ప్రధానమైన 370 ప్రశ్నలు అడగడంతో పాటు ప్రత్యేక ప్రత్యేక తీర్మానాలు ప్రవేశపెట్టారు. హిందూ వారసత్వ సవరణ, నేలబొగ్గు తవ్వకాల బిల్లులను సమర్పించారు. కళ్లకుర్చి జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాలతో కూడిన జనరల్ ఆసుపత్రిని తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ఉళుందూర్‌పేట - సేలం జాతీయ రహదారిని నాలుగు లేన్ల రహదారిగా పునరుద్ధరించారు. చిన్న సేలం, కళ్లకుర్చి బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మించాలని కోరుతూ రైల్వే శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

ఏర్కాడు...

వేసవి విడిదిగా గుర్తింపు పొందిన ఏర్కాడులో వసతుల కల్పన గిరిజనులు దశాబ్దాల కాలంగా పోరాటం సాగిస్తున్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రభుత్వ రవాణా సంస్థలు ఏర్కాడుకు బస్సులు నడపాలని స్థానికుల దీర్ఘ కాల కోరిక. కల్వరాయన్ కొండలో నివసిస్తున్న గిరిజనులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలను కోరుతున్నా ఇప్పటివరకు ఆ సమస్య తీరలేదు. సేలం నుంచి విరుదాచలం వరకు నడుపుతున్న ప్యాసింజర్ రైల్లో అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని పోరాడిన కారణంగా స్పందించిన దక్షిణ రైల్వే తాజాగా నాలుగు బోగీలతో రైలు నడుపుతోంది.


దేవదాస్ (పీఎంకే)

కుర్చీ ఎవరిదో...?

ఈ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో కళ్లకుర్చి పార్లమెంటు స్థానంలో డీఎంకే తరఫున మలయరసన్‌కు తొలిసారి పోటీ చేస్తున్నారు. అదే విధంగా, అన్నాడీఎంకే తరఫున కుమరగురు, పీఎంకే అభ్యర్థిగా దేవదాస్ పోటీలో ఉన్నారు. డీఎంకేకు పలుకుబడి అధికంగా ఉన్న కళ్లకుర్చిలో ఈ సారి కుర్చీ ఏ పార్టీకి దక్కుతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

● నీకు నేనూ.. నాకు నువ్వు



భర్తకు మద్దతుగా భార్య ... భార్యకు మద్దతు భర్త

● ఎన్నికల ప్రచారం

పెరంబూర్, ఏప్రిల్ 15: ఎన్నికల్లో వేర్వేరు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న భార్యాభర్తలు, ఒకరి కోసం మరొకరు ప్రచారం చేస్తుండడాన్ని ఆయా నియోజకవర్గాల ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. అన్నానగర్‌కు చెందిన రాజన్‌సింగ్, ఆయన భార్య సీత లోక్‌సభ ఎన్నికల్లో బహుజన ద్రావిడ పార్టీ తరఫున తెన్‌కాశి నియోజకవర్గంలో సీత, కన్నియాకుమారి నియోజకవర్గంలో రాజన్‌సింగ్ పోటీ చేస్తున్నారు. భర్తకు మద్దతుగా భార్య, భార్యకు మద్దతుగా భర్త ఇద్దరు అటు తెన్‌కాశి, ఇటు కన్నియాకుమారి నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. తెన్‌కాశి నియోజకవర్గం శంకరన్‌కోయిల్‌లో ఆదివారం సీతకు మద్దతుగా రాజన్‌సింగ్ ప్రచారం చేపట్టారు. చిన్న మైక్ చేతపట్టుకొని, కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న దంపతులను ప్రజలు ఆసక్తిగా చూశారు.

అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దు


వంటికి ప్లకార్డులు కట్టుకుని ప్రచారం చేస్తున్న శరవణన్

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తంలో మదురై జిల్లా కొట్టాంపట్టికి చెందిన సంఘ సేవకుడు శరవణన్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నోటకు ఓటును అమ్ముకోవద్దుంటూ ప్లకార్డులతో వినూత్న ప్రచారం చేస్తున్నారు. మండుటెండలో నత్తం బస్‌స్టేషన్ వద్ద నిలిచి కాళ్లు, చేతులకు ప్లకార్డులు కట్టుకుని అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దంటూ నినాదాలు చేస్తున్నారు. శరవణన్ కట్టుకున్న ప్లకార్డులపై కరెన్సీ నోట్లు, కానుకలు తీసుకోకుండా నచ్చినవారికి ఓటేద్దామని శపథం చేద్దాం.... ఎంతో మంది త్యాగధనులు సాధించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలంటే డబ్బుకు లొంగకుండా నిర్భయంగా ఓటేయాలి... అంటూ వివిధ రకాలుగా నినాదాలు ముద్రించి ఉన్నాయి. ఈ వినూత్న ప్రచారాన్ని ప్రయాణికులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

● ఎలక్షన్ కదా మరి!


ఆనంది, కుటుంబ సభ్యులతో భోజనం చేస్తున్న అన్నామలై

మహిళా కార్యకర్త ఇంట అన్నామలై భోజనం

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రచారంలో భాగంగా ఓ మహిళా కార్యకర్త ఇంట్లో భోజనం చేశారు. కోయంబత్తూరు సమీపం తుడియలూరు ముత్తునగర్‌లో ఆయన ప్రచారం చేస్తూ ఆ ప్రాంతంలోని ఆనంది అనే మహిళా కార్యకర్త ఇంటికి వెళ్లారు. అప్పటికే మధ్యాహ్నం కావడంతో ఆనంది, ఆమె కుటుంబ సభ్యులతో పాటు అన్నామలై నేలపై కూర్చుని అరటి ఆకులో వడ్డించిన ఆహార పదార్థాలను ఆరగించారు. సుమారు అరగంటసేపు ఆనంది ఆమె కుటుంబసభ్యులతో చర్చించారు.. ఆ తర్వాత పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారానికి బయలుదేరారు.

● అయ్యో దేవుడా!


విరుదునగర్‌లో ప్రేమలత ప్రచారం

ఎన్నికల్లో గెలిచాకే విజయ ప్రభాకరన్‌కు పెళ్లి

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న తన కుమారుడు విజయ ప్రభాకరన్ ఎంపీగా గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజల సమక్షంలో వివాహం జరిపిస్తానని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత అన్నారు. అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నానని పేర్కొన్నారు. కెప్టెన్ విజయకాంత్ లేరని ఎవరూ బాధ పడకూడదని, ఆయన ఆశీస్సులు ఉండటం వల్లే ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తామని చెప్పారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రధాని పదవికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

ఆరు నియోజకవర్గాల్లో ప్రతికూల పవనాలు?

ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక! ● ఇన్‌ఛార్జి మంత్రులకు స్టాలిన్ వార్నింగ్



చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆరు లోక్‌సభ నియోజకవర్గాల్లో పరిస్థితి ఏమాత్రం బాగా లేదని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఆ నివేదిక ప్రకారం ఆ ఆరు నియోజకవర్గాలలో ప్రచార కార్యక్రమాలు మందకొడిగా సాగినట్లు స్పష్టమవుతోంది. నివేదికను పరిశీలించిన స్టాలిన్ ఆ ఆరు నియోజకవర్గాలను అప్పగించిన మంత్రులను పిలిచి హెచ్చరించి పంపినట్లు తెలిసింది. 2019లో అన్నాడీఎంకే బలమైన పార్టీలతో పొత్తులు కుదుర్చుకుని పోటీ చేసినా డీఎంకే కూటమి 38 నియోజకవర్గాల్లో గెలిచింది. ప్రస్తుతం బీజేపీతో తెగతెంపులు చేసుకుని అన్నాడీఎంకే బరిలోకి దిగటంతో మూడు కూటముల వల్ల తమ కూటమి గెలుపునకు ఢోకా లేదని స్టాలిన్ భావిస్తున్నారు. అదే సమయంలో ఈ ఎన్నికల్లో ఒకటిరెండు నియోజకవర్గాలలో ఓటమిపాలైనా ప్రతిపక్ష పార్టీలు డీఎంకే ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నట్లు ప్రచారం చేస్తాయని స్టాలిన్ ఆందోళన చెందుతున్నారు. ఇంటెలిజెన్స్ అధికారుల సమాచారం ప్రకారం పొల్లాచ్చి, తిరుప్పూరు, నామక్కల్, ఈరోడ్, కళ్ళకురిచ్చి, కృష్ణగిరి నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి ప్రచారంలో బాగా వెనుకబడి ఉంది. పొల్లాచ్చి లోక్‌సభ నియోజకవర్గం అన్నాడీఎంకేకు కంచుకోట అని చెబుతారు. ఆ లోక్‌సభ నియోజకవర్గంలోని ఆరు శాసనసభ నియోజకవర్గాలు ప్రస్తుతం అన్నాడీఎంకే ఖాతాలో ఉన్నాయి. ముఖ్యంగా తొండాముత్తూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి నాయకత్వంలో అన్నాడీఎంకే ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. ఈ నియోజకవర్గంలో మంత్రి చక్రపాణి ప్రచారం చేస్తున్నా వేలుమణి స్థాయికి చేరుకోలేదని స్థానిక నాయకులే చెబుతున్నారు. ఇదే విధంగా తిరుప్పూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆరు శాసనసభ నియోజకవర్గాల్లో నాలుగు అన్నాడీఎంకే గెలుచుకుంది. ఈ నియోజకవర్గంలో డీఎంకే కూటమి నుంచి సీపీఐ సిట్టింగ్ ఎంపీ సుబ్బరాయన్ పోటీ చేస్తున్నారు. అన్నాడీఎంకే స్థానిక నాయకులు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఈ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న మంత్రి ముత్తుసామి నాయకత్వంలో ప్రచారం అంతంత మాత్రంగానే ఉందని ఇంటెలిజెన్స్ నివేదికలో పేర్కొన్నారు. ఇదే విధంగా ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గంలోనూ డీఎంకే బలహీనంగా ఉన్నట్లు తెలుసుకున్న మంత్రి ఉదయనిధి దిగ్భ్రాంతి చెందారు. డీఎంకే యువజన విభాగం కోటా కింద ఈరోడ్ నియోజకవర్గాన్ని పొంది అక్కడ ప్రకాష్‌ను బరిలోకి దింపారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో ప్రచారం మందకొడిగా సాగుతుండటంతో ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముత్తుసామికి తోడుగా మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళిని కూడా నియమించారు. అయితే అన్నాడీఎంకే అభ్యర్థి ఆట్రల్ అశోక్‌కుమార్ ప్రచారంలో ముందంజలోనే ఉన్నారని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో పార్టీ నాయకుల నడుమ సమన్వయం కొరవడిందని కూడా తెలుస్తోంది. ఇక నామక్కల్ నియోజకవర్గాన్ని పరిశీలిస్తే పార్టీల పరంగా సమస్యలు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో డీఎంకే మిత్రపక్షమైన కొంగు మక్కల్ దేశియ మున్నేట కళగం పోటీ చేస్తోంది. తొలుత సూర్యమూర్తిని అభ్యర్థిగా ప్రకటించి, ఆ తర్వాత అభ్యర్థిని మార్చి మాతేశ్వరన్‌ను దింపారు. దీంతో ఆగ్రహించిన సూర్యమూర్తి సొంత పార్టీ ఓటమికి తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు స్టాలిన్ దృష్టికి వెళ్లింది. ఆ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న మంత్రి మదివేందన్ స్థానిక డీఎంకే సీనియర్ నాయకులను ప్రచారంలో పాలుపంచుకునేలా చేయడంలో విఫలమవుతున్నట్లు తెలుసుకున్నారు. అదే సమయంలో అన్నాడీఎంకే కూటమి గెలుపుకోసం మాజీ మంత్రి తంగమణి పకడ్బందీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో కాంగ్రెస్ పోటీ చేస్తున్న కృష్ణగిరి నియోజకవర్గంలో ప్రచారం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఈ నియోజకవర్గానికి చెందిన అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కేపీ మునుసామి ప్రచారంలో రాకెట్ వేగంతో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గోపీనాథ్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు తక్కువ సంఖ్యలోనే ప్రచారం చేస్తున్నట్లు డీఎంకే వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక కళ్ళకురిచ్చిలో పోటీ చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి కుమారగురుకు సానుకూల పవనాలు వీస్తున్నాయని ఇంటెలిజెన్స్ నివేదికలో పేర్కొన్నారు. ఈ నియోజకవర్గంలో డీఎంకే తరఫున గౌతమ శిఖామణి రెండోసారి పోటీ చేస్తున్నారు. దీంతో సీటు ఆశించి నిరాశ చెందిన డీఎంకే నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇలా ఆరు లోక్‌సభ నియోజకవర్గాల స్థితిగతులను ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా తెలుసుకున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులుగా పనిచేస్తున్న మంత్రులకు ఫోన్ చేసి వార్నింగ్ ఇచ్చారు. ఇక ప్రచారానికి రెండు రోజులే మిగిలి ఉండటంతో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా విజయం సాధించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం.


ట్యాంకర్ లారీ వద్ద నీరు పడుతూ మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న సెంట్రల్ చెన్నై నియోజకవర్గ డీఎండీకే అభ్యర్థి పార్థసారథి

యువతను డ్రగ్స్‌కు బానిసల్ని చేస్తారా?

● ఈ విషయంపైనా నోరు తెరవరా?
● దయానిధిపై వినోజ్ పి.సెల్వం ఆగ్రహం


ప్రచారం చేస్తున్న వినోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి చెన్నైకి రకరకాల డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వం నిద్రపోతోందని సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ డ్రగ్స్ వల్ల యువత తీవ్రంగా నష్టపోతోందని, అయినా సెంట్రల్ చెన్నై సిట్టింగ్ ఎంపీ దయానిధి మారన్ ఏనాడూ నోరు తెరవలేదని మండిపడ్డారు. నియోజకవర్గ ఎంపీగా ఎన్నికైన వ్యక్తి తన ప్రాంత బాగోగులైనా చూసుకోకపోతే ఎలా అని నిలదీశారు. సెంట్రల్ చెన్నై నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న వినోజ్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం నుంచి డీఎంకేను పారదోలాల్సిన అవసరం వుందన్నారు. అప్పుడే ఈ రాష్ట్రం బాగుపడుతుందన్నారు. సెంట్రల్ చెన్నై నియోజకవర్గం రాష్ట్ర రాజధానిలో ఉందంటే ఎవ్వరూ నమ్మరని, ఆ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గంలో సమస్యల్ని పరిష్కరిస్తానన్నారు. తాను విజయం సాధించిన వెంటనే తాగునీరు, అందరికీ పక్కా ఇళ్లు కల్పించే బాధ్యతను తీసుకుంటానని హామీనిచ్చారు.

● పాపం ఎన్ని కష్టాలో?!

కార్యకర్తలు అందించే రూ.50, రూ.100తోనే ప్రచారం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



పెరంబూర్, ఏప్రిల్ 15: కార్యకర్తలు విరాళంగా అందిస్తున్న రూ.50, రూ.100తోనే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై తెలిపారు. నగరంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలను నమ్మి తాము ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. దేశాన్ని 50 ఏళ్ల పాలించిన పార్టీగా కాంగ్రెస్‌కు ఘనచరిత్ర ఉన్నా డబ్బు మాత్రం లేవన్నారు. కార్యకర్తలు అందిస్తున్న విరాళాలతోనే ప్రచారం చేపడుతున్నట్లు సెల్వపెరుందగై తెలిపారు.


శ్రీపెరంబుదూర్ లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఆయన కుమారుడు, మంత్రి టీఆర్బీ రాజా


పుచ్చకాయలపై వాజ్‌పేయి, మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, తమిళిసై సౌందర్‌రాజన్ చిత్రాలతో ప్రచారం చేపట్టిన తిరునెల్వేలి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్

చిత్రజ్యోతి

సోనియా అగర్వాల్ - వినీత విజయకుమార్ నటించిన 'దండుపాళయం'


'దండుపాళయం'లో సోనియా అగర్వాల్ - వినీత విజయ్‌కుమార్

సీనియర్ నటీమణులు సోనియా అగర్వాల్, వినీత విజయ్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండుపాళయం'. టైగర్ వెంకట్ - కేటీ నాయక్ దర్శకత్వం వహించారు. వెంకటేశ్వర మూవీస్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా టైగర్ వెంకట్ నటించారు. ముమైత్‌ఖాన్, సూపర్‌గుడ్ సుబ్రమణియం, బిర్లా బోస్, ఆలియా, నిషా, రవిశంకర్, రాయల్ ప్రభాకర్ తదితరులు నటించారు. సినిమాటోగ్రఫీ ఇళంగోవన్, సంగీతం జిత్తన్ రోషన్. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు టైగర్ వెంకట్. ఈ సినిమా గురించి దర్శకుడు టైగర్ వెంకట్, కేటీ నాయక్ మాట్లాడుతూ... 'ఈ సినిమా చిత్రీకరణ బెంగళూరు, కేజీఎఫ్, చెన్నై, తిరుచ్చి, చిత్తూరు, కడప, నగరి తదితర ప్రాంతాల్లో రెండు షెడ్యూళ్లలో 45 రోజుల్లో పూర్తిచేశాం. ఇందులో ఒక పాట మాత్రమే ఉంటుంది. మేలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. 1980 నుంచి ఇప్పటివరకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో హత్యలు, దోపిడీలు వంటి నేరాలకు పాల్పడుతున్న ముఠాను 15 యేళ్ల తర్వాత అరెస్టు చేశారు. ఈ ముఠాపై 108 హత్య కేసులు, 390 చోరీ కేసులు, 90 ఘోరమైన అత్యాచార కేసులు తదితరాలు నమోదై ఉన్నినయి. అలాగే, నేరస్థులను అరెస్టు చేసిన పోలీసులు కూడా చాలా కష్టాలను అనుభవిస్తున్నారు. అరెస్టయిన నేరస్థులు కూడా కొంతకాలం తర్వాత నిర్దోషులుగా విడుదలవుతున్నారు. ఇలాంటి కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించాం' అని పేర్కొన్నారు.

'జారుడు స్తంభం' క్రీడలో రాణిస్తున్న దివ్యాంగులు

● ప్రోత్సహిస్తున్న రాఘవ లారెన్స్


దివ్యాంగ క్రీడాకారులతో రాఘవ లారెన్స్

తమిళ సంప్రదాయ క్రీడల్లో జల్లికట్టుతో పాటు జారుడు స్తంభం (మల్లర్ కంబం) ఒకటి. ఈ క్రీడలో వికలాంగులు అద్భుతంగా రాణిస్తున్నారు. ఇలాంటి వారిని దర్శక హీరో, నిర్మాత రాఘవ లారెన్స్ ప్రోత్సహిస్తున్నారు. ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు తన సొంత నిధులను ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రీడాకారులను ఆయన సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రాఘవ లారెన్స్ మాట్లాడుతూ... 'ఇలాంటి వారే నాకు ఎల్లవేళలా స్ఫూర్తి. కొన్ని సందర్భాల్లో నిరాశ నిస్పృహల్లో కూరుకునివుంటే ఈ క్రీడాకారులతో సాహస క్రీడలను ప్రదర్శించి ఆనందిస్తుంటాను. సినిమాల్లో నాకు అవకాశం వస్తే వారితో డ్యాన్స్ చేయించా. నయనతార ఎన్నిసార్లు డ్యాన్స్ చేసినా ప్రేక్షకులు చూస్తున్నారు కదా, అలాగే వీరి సాహసాలు, డ్యాన్సులను కూడా చూస్తారని చెబుతుంటా. అయితే, కొంతకాలంగా వీరికి అవకాశాలు తగ్గిపోయాయి. అపుడే నాకు ఓ ఆలోచన వచ్చింది. అదే జారుడు స్తంభం సాహస క్రీడ. పూర్తి ఆరోగ్యంతో ఉన్నవారు మాత్రమే నేర్చుకునే క్రీడ. ఇలాంటి వికలాంగులు నేర్చుకోవచ్చా లేదా అనే విషయంపై అనేక మంది వద్ద ప్రస్తావించగా, నేర్చుకుంటాం అని ధైర్యంగా చెప్పారు. అలా ఈ క్రీడను నేర్చుకుని, ఇపుడు మీరంతా ఆశ్చర్యపోయేలా ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి వారికి అవకాశాలు ఇవ్వాలని మీడియా ద్వారా విజ్ఞప్తి చేస్తున్నా. వీరి అభ్యున్నతి కోసం కృషి చేస్తా. ఈ కళను నేర్చుకున్న వారిని ప్రోత్సహిస్తా. వీరందరికీ స్కూటీలు బహుమతిగా ఇస్తున్నా. ముఖ్యంగా ఈ దివ్యాంగులతో సినిమా కూడా తీయబోతున్నా. ఆఆదాయంతో వీరందరికీ ఇళ్లు కట్టిస్తా. వీరికి ఈ సాహస క్రీడను నేర్పించిన మాస్టర్ ఆదిత్యన్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

మోహన్ హీరోగా 'హరా'


'హర' చిత్ర యూనిట్ సభ్యులు

తమిళ చిత్రపరిశ్రమలో సిల్వర్ జూబ్లీ హీరోగా గుర్తింపు పొందిన నటుడు మోహన్ నటించిన తాజా చిత్రం 'హరా'. కోయంబత్తూర్ ఎస్పీ మోహన్ రాజ్, జీ మీడియా జయ శ్రీ విజయ్ కలిసి నటించారు. ఈ చిత్ర ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. మోహన్ సరసన స్వాతి, అనిత నటించారు. సంగీతం రషాంత్ ఆర్విన్ అందించారు. ఈ ట్రైలర్ రిలీజ్ వేడుకలో మాట్లాడుతూ, 'నేను నటించడం ప్రారంభించిన తర్వాత, నాకు మార్కెట్ అవకాశాలు పెరిగి నిర్మాతలంతా వచ్చి సినిమాలు చేస్తారని భావించా. నేను నటించిన చిత్రాల్లోని పాటలన్నీ సూపర్ హిట్ కావడానికి కారణం ఇసైజ్ఞాని ఇళయరాజా. ఎలాంటి పక్షపాతంలేకుండా అందరి హీరోలకు సమానంగా పాటలు అందిస్తారు. ఇపుడు మార్కెట్ గురించి ఆలోచించడం లేదు. కథ నాకు నచ్చాలి. స్క్రిప్టు, స్క్రీన్‌ప్లేను ఏడుసార్లు మార్చాం. విజయ్ శ్రీ వద్ద అద్భుతమైన లైట్ అండ్ సౌండ్ సెన్స్ ఉంది. ఈ ప్రతిభను అయన మరో స్థాయికి తీసుకెళ్లాలని కోరుతున్నాను. లోకేషన్‌కు వెళ్ళిన తర్వాత దర్శకుడు విజయశ్రీ సినిమా గురించే ఆలోచిస్తుంటారు. ఆయన జీవించి ఉన్నారంటే కారణం ఆయన భార్యాపిల్లలు చేసిన పుణ్యం. ఆయన ఇలాంటి మంచి సినిమాలు నిర్మించాలి. ఇందులో ఆరంభంలో పాటలు లేవు. కానీ, తర్వాత మూడు పాటలను పెట్టారు. ఈ పాటలకు సాహిత్యం ఆయనే అందించారు. మణివణ్ణన్‌కు ఉన్నటువంటి తెలివితేటలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం నచ్చే విజయ్ శ్రీ రూపొందించారు' అని పేర్కొన్నారు.